


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

గురువారం। 13 నవంబరు 2025

పేజీలు 8


# తెలుగు జాతి గర్వపడేలా విద్యార్థులు ఎదగాలి

- అట్టహాసంగా రాయలసీమ యూనివర్సిటీ నాల్గవ కాన్వకేషన్
- సైంటిస్ట్ ఎస్ఎస్‌సి రామ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ ప్రధానం
- 75 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ ప్రధానం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** తెలుగుజాతి గర్వపడేలా తమ భవిష్యత్తును విద్యార్థులు నిర్మించుకోవాలని రాష్ట్ర గవర్నర్, రాయలసీమ యూనివర్సిటీ చాన్సలర్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. బుధవారం ఆర్‌యూ ఉపకులపతి వెంకట బసవరావు అధ్యక్షతన నిర్వహించిన రాయలసీమ యూనివర్సిటీ 4వ కాన్వకేషన్‌కు చాన్సలర్ హోదాలో మొట్ట మొదటిసారిగా రాష్ట్ర గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ మిగతా 2లో



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



కాన్వకేషన్‌కు హాజరైన కలెక్టర్ సిరి, ఉదయ యూనివర్సిటీ ఇంచార్జ్ విసి, కర్నూలు ఆర్డీఓ

# విద్యార్థి విజయానికి చదువే కీలకం

- మీరు నేర్చుకున్న విద్య సమాజానికి ఉపయోగపడాలి
- రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** విజయానికి విద్య కీలకమని విజయం అంటే కేవలం వ్యక్తిగత లక్ష్యాలను సాధించడం మాత్రమే కాదు, సమాజానికి ఉపయోగపడాలని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీద్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఏ క్యాంపులో ఉన్న మాంటిస్సోరీ సీనియర్ సెకండరీ స్కూల్‌లో మాంటిస్సోరి సంస్థల గోల్డెన్ జూబ్లీ వేడుకల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి, కర్నూలు ఎంపి నాగరాజు, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, విద్యాసంస్థల అధినేత కేఎన్‌వి రాజశేఖర్, డిఈఓ శామ్యూల్‌పాల్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత స్వర్గీయ కళ్యాణమ్మ అంకితభావంతో విద్యారంగం అభివృద్ధికి కృషి చేశారని, పిల్లల సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి మిగతా 2లో



మాంటిస్సోరి గోల్డెన్ జూబ్లీ వేడుకలను ప్రారంభిస్తున్న గవర్నర్

## మెడికల్ కళాశాలల పై వై.ఎస్.జగన్

# మొసలి కన్నీళ్ళు

- అభివృద్ధి,సంక్షేమ పథకాలకు కోతపెట్టి మెడికల్ కళాశాలలు నిర్మించాలా..?
- డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి

**ప్యాపిలి,మేజర్‌న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలపై మొసలి కన్నీళ్ళు కారుస్తున్నారని డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలనలో మిగతా 2లో



మామిళ్ళపల్లిలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ పై ప్రజా ఉద్యమం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** వైద్య కళాశాలలను, వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుట్రలు పన్నారని, ఇది ముమ్మాటికి దుర్మార్గమైన చర్యలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాలు పేర్కొన్నారు. బుధవారం వైయస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మిగతా 2లో



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన తెలుపుతున్న వైసీపీ శ్రేణులు

# ప్రభుత్వం పేద ప్రజలకు వైద్య విద్యను దూరం చేస్తుంది



ర్యాలీగా వెళ్తున్న వైసిపి నాయకులు

- ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైకాపా శ్రేణులు భారీ నిరసన,ర్యాలీ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు వైద్య విద్యను దూరం చేస్తుందని ప్రైవేటీకరణ పేరుతో కుట్ర పన్నుతుందని కర్నూలు వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రైవేటు వైద్య కళాశాలల మిగతా 2లో

సూర్య www.suryaa.com



# విద్యార్థి విజయానికి చదువే కీలకం

(మొదటి పేజీ తరువాయి)



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గవర్నర్

వినూత్న బోధన పద్ధతులను అమలు చేయడంలో మాంటిస్సోరి విద్యాసంస్థలు కృషి చేశాయని తెలిపారు. మంత్రి టీజీ భరత్, నంద్యాల ఎంపి డా.బి శబరితో పాటు అనేక మంది రాజకీయ నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు, వైద్యులు, న్యాయవాదులు, పైలట్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, మాంటిస్సోరి విద్యాసంస్థల్లో చదువుకున్నారన్న విషయం తెలిసి చాలా సంతోషంగా ఉందన్నారు. విద్య ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని పెంపొందించడంతో పాటు అసమానతలను తగ్గించడంలో విద్య ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. చదువు సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగు పరుస్తుందని, పేదరిక చక్రాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. ప్రభుత్వం బాలికల విద్య, లింగ సమానత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల విద్యను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, దీనివల్ల సమాజానికి మేలు కలుగుతుందని గవర్నర్ పేర్కొన్నారు. కర్నూలు ఎంపి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు నగరంలో 50వసంతాల క్రితమే కల్యాణమ్మ మాంటిస్సోరి పాఠశాలకు పునాది వేశారన్నారు. ప్రస్తుతం 50సంవత్సరాల తర్వాత మాంటిస్సోరి విద్యాసంస్థలు అనేక బ్రాంచ్‌లు ప్రారంభించి వేలాది మంది విద్యార్థులకు చదువును నేర్పిస్తున్నారని తెలిపారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాంటిస్సోరి విద్యాసంస్థలు విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు.

## రాజీకాదగిన కేసులను లోక్ అదాలత్‌కు తీసుకురావాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** రాజీకాదగిన కేసులను లోక్ అదాలత్‌కు తీసుకురావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి కబర్ధి, కార్యదర్శి లీలా వెంకట శేషాద్రిలు అన్నారు. డిసెంబరు 13న జరిగే లోక్ అదాలత్‌పై బుధవారం జిల్లా కోర్టులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకాదగిన కాంపౌండబుల్ క్రిమినల్, ఎక్సైజ్, ఎంవిఓపి, చెక్‌బౌన్స్, భూసేకరణ కేసులు, సివిల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ సదస్సులో జడ్జిలు కమలాదేవి, వాసు, లక్ష్మీరాజ్యం, శోభారాణి, రాజేంద్రబాబు, శ్రీవిద్య, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, సీనియర్ సివిల్ జడ్జిలు మల్లేశ్వరి, దివాకర్, జూనియర్ సివిల్ జడ్జిలు సరోజమ్మ. అపర్ణ, అనిల్ కుమార్, అనూష పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజా ఉద్యమ నిరసన ర్యాలీకి పిలుపులో భాగంగా నిరసన తెలిపారు. నంద్యాల పట్టణం ఉదయానంద రెసిడెన్సీ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ బయలుదేరి కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, చైర్‌పర్సన్ మాబున్నీసా, సాయినాథ్‌రెడ్డి, రామలింగారెడ్డి, శశికళారెడ్డి, అమృతరాజ్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాలు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాన్న ఆలోచన వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 12 మెడికల్ కళాశాలలు ఉన్నాయని వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైయస్ జగన్ చరిత్రలో చేయని విధంగా ఏకంగా 17 మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి తీసుకుని వచ్చారన్నారు. మొదటి విడతలో 5 కళాశాలలు ప్రారంభించారని ఈకళాశాలల్లో 750మెడికల్ విద్యార్థులను



జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి,ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

విద్యను అభ్యసిస్తున్నారన్నారు. నంద్యాల మెడికల్ కళాశాలకు 16 పీజీ సీట్లు కేటాయించారని తెలిపారు. 11 డిస్టింక్షన్లు సాధించారని తెలిపారు. ఇటువంటి సమయంలో కళాశాలలను ప్రైవేటీకర ణ చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు, వారి వ్యాపార ప్రయోజనాల కొరకు పీపీపి విధానం తేవడం కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వం పేద ప్రజలకు వైద్య విద్యను దూరం చేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)



తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎస్‌వి మోహన్ రెడ్డి, నాయకులు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జిల్లా కార్యాలయం నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు పెద్ద సంఖ్యలో వైసిపి కార్యకర్తలు హాజరై నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వైసిపి పార్టీ తరపున పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రూ.5వేల కోట్లు ఖర్చు పెట్టి పేద విద్యార్థుల కొరకు ఖర్చు చేయలేదా అని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ ద్వారా టెండర్లు ఎవరు దక్కించుకున్నా వైసిపి అధికారంలోకి వచ్చాక వాటిని అన్ని రద్దు చేస్తుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మెడిక ల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కెఎంసి మేయర్ బివై రామయ్య, వైకాపా సీనియర్ నేత గంగుల ప్రబాకర్ రెడ్డిలు మాట్లాడుతూ అమరావతి రాజధాని కోసం ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేస్తుందని, పేద ప్రజలకు ఉపయోగపడే వైద్యం కోసం వేల కోట్లు ఖర్చు చేయలేదా అని ప్రశ్నించారు. అనంతరం కర్నూలు అర్బన్ తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపిడిఓ

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి.బెలగల్ మండలం పోలకలు గ్రామ సచివాలయంను ఎంపిడిఓ రాణెమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహిస్తున్నహెల్త్ క్యాంపు పరిశీలించి గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా ప్రభుత్వ వైద్యులను సంప్రదించి సలహాలు సూచనలు తీసుకోవాలని అదేవిధంగా వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండావైద్య చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. పిఎస్ సునీల్ రాణి,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.




# తెలుగుజాతి గర్వపడేలా విద్యార్థులు ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

కాన్వకేషన్‌లో బాలికలు అధిక శాతంలో బంగారు పతకాలు తీసుకోవడం తనకు సంతోషాన్ని చ్చిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యారంగం లో అనేక మార్పులు వచ్చాయని విద్యార్థులు ఆ మార్పులకు అనుగుణంగా తాముఎంచుకున్న రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ నేపథ్యంలో స్వామి వివేకానంద చెప్పిన తెలివైన మాటలను గుర్తు చేసుకుందాం అంటూ ఒక ఆలోచనను చేపట్టండి, ఆ ఒక్క ఆలోచనను మీ జీవితంగా చేసుకోండి-దాని గురించి ఆలోచించండి, దాని గురించి కలలు కనండి, ఆ ఆలోచనపై జీవించండి ఇదేవిజయాని కి మార్గం అంటూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. గేట్ వే ఆఫ్ రాయలసీమగా కర్నూలు దిన దిన అభివృద్ధి చెందుతుందని, దేశంలోనే ప్రముఖంగా ఉన్న ఐఐఐటి డిఎంతో పాటు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీలు ప్రధానంగా కర్నూలులోనే ఉన్నాయని ఆ సంస్థలు అనేకమంది విద్యార్థులను భావి భారత పౌరులను తీర్చిదిద్ది దేశ అభివృద్ధికి పాటుపడుతు న్నాయని అన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ప్రతిఒక్కరు అడుగులు వేసి చారిత్రాత్మక అభివృద్ధికి పాటుపడదామని అన్నారు. జాతీయ విద్యా విధానం అమలు పరచడంలో రాష్ట్రంలోనే రాయలసీమ యూనివర్సిటీ అగ్రగామిగా ఉందన్నారు. అంతకు ముందు యూనివర్సిటీ ఉపకులపతి వెంకట బసవరావు మాట్లా డుతూ రాయలసీమ యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుండి విద్యార్థుల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తుందన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రూసా నిధుల ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్విరామంగా చేపడుతున్నామన్నారు. యూనివర్సిటీకి చెందిన బ్యాడ్మిం టన్ ప్లేయర్ ఆకాంక్ష అంతర్జాతీయ యూనివర్సిటీ గేమ్స్‌కు రాయలసీమ యూనివర్సిటీ 2022-23అకాడ మిక్ ఇయర్‌లో ప్రాతినిత్యం వహించిందని గుర్తుచేశారు. యూనివర్సిటీ విద్యార్థులు చదువుతో సమానంగా క్రీడల్లో రాణిస్తూ అనేక స్థాయిల్లో గెలుపొందారని అన్నారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలలో వరుసగా రెండో స్థానంలో నిలిచారన్నారు. క్రీడాకారులు ఆల్ ఇండియాతో పాటు ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ప్రాతినిత్యం వహించినట్లు తెలిపారు. అనంతరం గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత ఏ.ఎమ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ డా.ఎస్.ఎస్.వి రామకుమార్ మాట్లాడుతూ రాయలసీమలో యూనివర్సిటీ లాంటి మహా విద్యాలయంలో విద్యార్థులు డిగ్రీ పట్టాను తీసుకొని దేశంలోనే అగ్రగామిగా ఎదగాలని ఆకాంక్షించారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని అనుసరిస్తూ విద్యార్థులు తమ లక్ష్యాలను అధిరోహించాలని సూచించారు. వివిధ విభాగాల్లో గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలనుప్రధానం చేశారు. జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె మధుమూర్తి, కర్నూలు ఎంపి నాగరాజు, డాక్టర్ అబ్దుల్ హక్ యూని వర్సిటీ ఇంచార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ పి.ఎస్ షావలీ ఖాన్, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు ఆర్డీఓసందీప్, ఆర్‌యూ రెక్టార్ ఎన్‌టికె నాయక్, రిజిస్టర్ విజయ్‌కుమార్ నాయుడు, పాలకమండలి సభ్యులు డాక్ట ర్ శశికళ,డా. శైలజ, యూనివర్సిటీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా. శివకిషోర్‌తో పాటు యూనివర్సిటీ అనుబంధ కళా శాలల ప్రిన్సిపల్‌లు, డీన్‌లు, డైరెక్టర్స్, విద్యార్థుల తల్లి దండ్రులు హాజరయ్యారు. అంతకుముందు గవర్నర్‌కు ఎన్‌సిసి విద్యార్థులు గౌరవ వందనం చేసి ఆహ్వానం పలికారు.



ఎన్‌సిసి విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర గవర్నర్



డాక్టర్ ఎస్.వి రామకుమార్‌కు గౌరవ డాక్టరేట్ అందచేస్తున్న గవర్నర్



హాజరైన ఎంపి నాగరాజు, ఎమ్మెల్యే దస్తగిరి



విద్యార్థినికి గోల్డ్ మెడల్‌ను బహుకరిస్తున్న గవర్నర్

# ప్రభుత్వ వైద్యవిద్య పేదవిద్యార్థుల హక్కు

★వైద్యకళాశాలలపై కూటమి కుట్రలు ఆపాలి
★ప్రజాపక్షం..జగనన్న హితం★వైకాపా కన్వీనర్ ఎర్రకోట రాజీవ్‌రెడ్డి



ర్యాలీగా వస్తున్న ఎర్రకోట రాజీవ్‌రెడ్డి , వైకాపా శ్రేణులు

ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి : ప్రభుత్వ వైద్యవిద్య అనేది రాష్ట్రంలోని పేద విద్యార్థుల హక్కు కావున కూటమి నేతలు వైద్యకళాశాలలు ప్రైవేట్ పరం చేసే కుట్రలు మానుకోవాలని ఎమ్మిగనూరు వైకాపా ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్‌రెడ్డి పేర్కోన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఎర్రకోట ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఇంటి దగ్గర నుండి ఓంశాంతి కూడలి, పార్క్ సర్కిల్ , వైఎస్ఆర్ కూడలి చేరేకుని అక్కడ మహానేత దివంగత వైఎస్ఆర్‌కు కు గజమాల వేసి నివాళి ఘటించారు. అనంతరం ఎమ్మిగనూరు చేనేత పితామహులు పద్మశ్రీ మాచాని సోమప్ప విగ్రహానికి పూలమాలవేసి అక్కడ వైకాపా శ్రేణుల దర్నా చేపట్టారు. తాశీల్దార్ కార్యాలయం చేరుకున్న తర్వాత రాష్ట్ర వైకాపా పార్లమెంటరీ కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎర్రకోట రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన 40 ఏళ్ల చరిత్రలో ఏనాడు సాధించని వైద్యకళాశాలలు జగనన్న తన పాలనలో 17 వైద్యకళాశాలలను సాధించి నిర్మాణాలు పూర్తి చేసిన 7 కాలేజీలతో పాటు నిర్మాణదశలో ఉన్న 10 కళాశాలలు ప్రైవేట్ పరంచేసే కుట్రలు మానుకోవాలని హితవు పలికారు. 16 ఏళ్లు ముఖ్యమంత్రి పాలన అందించిన చంద్రబాబునాయుడు ఏనాడు చెయ్యలేని పనులు జగనన్న చేసి చూయించారనే అక్కస్సుతో వైద్యవిద్యను పేదలకు దూరం చేసే కుటీల యత్నాలు మానుకోవాలని , లేకుంటే పేద విద్యార్థుల ఉసురు కొట్టుకుని పోతారని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు కుట్రలు తిప్పికొట్టడానికి జగనన్న పేదప్రజల పక్షాన నిలిచి పోరుబాట చేస్తారని ఇందుకు పార్టీ శ్రేణులకూడా అండగా నిలుస్తాం అన్నారు. అనంతరం తాశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అథిధిగా ఎమ్మిగనూరు వైకాపా పరిశీలకులు తెర్నకల్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణ క న్వినర్ నాగేశప్ప, ఎమ్మిగనూరు , నందవరం, గోనెగండ్ల, మండల వైకాపా కన్వీనర్లు బీఆర్ బసిరెడ్డి, శివారెడ్డిగౌడు, కృష్ణారెడ్డి, వైకాపా నాయకులు మీసాల నీలకంఠ, గడ్డం నారాయణరెడ్డి, కనకవీడు లక్ష్మికాంతరెడ్డి, విరుపాక్షిరెడ్డి ముగతి,ఎంపిపి కేశన్న, అతావుల్లా, ప్రభాకర్ , కె రమేష్ రియాజ్ అహమ్మద్, బీమిరెడ్డి, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ కదంతొక్కిన వైసిపి శ్రేణులు

:- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ హెచ్చరిక

కోడుమూరు, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ కొత్త వైద్య కళాశాలలు, ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారంకోడుమూరులో వైసిపి తలపెట్టిన నిరసన ర్యాలీలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు కదంతొక్కారు. వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డి పిలుపు మేరకు ఎస్ఈసి సభ్యులు, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైసిపి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో కోడుమూరు పట్టణంలో తలపెట్టిన నిరసన ర్యాలీకి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ప్రధాన వీధుల వెంట వైసిపి శ్రేణులు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో 11 ప్రభుత్వ కళాశాలలు ఉండగా 2019లో వైఎస్ జగన్ అధికారం చేపట్టాక ఒకేసారి ఏకంగా 17కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వీటిలో 5మెడికల్ కళాశాలలను 2023-24లో గత ప్రభుత్వంలోనే ప్రారంభించారని చెప్పారు.



మాట్లాడుతున్న ఆదిమూలపు సతీష్, కోట్ల హర్ష

మాజీ తద్వారా 750ఎంబిబిఎస్ సీట్లను మాజీ సిఎం వైఎస్ జగన్ మన విద్యార్థులకు అదనంగా సమకూర్చారని గుర్తు చేశారు. ప్రజలకు చేరువలో మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వాసుపత్రులను బోధనా సుపత్రులుగా బలోపేతం చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య కళాశాలలకు గ్రహణం పట్టుకుందన్నారు. చంద్రబాబు కక్షపూరిత విధానాలతో రెండేళ్లలో రాష్ట్రం ఏకంగా 2450 ఎంబిబిఎస్ సీట్లను కోల్పోయిందన్నారు. రూ.లక్ష కోట్ల విలువైన సంపదలాంటి ప్రజల ఆస్తులను పచ్చ కార్పొరేట్ గద్దలకు దోచిపెట్టడం కోసం చంద్రబాబు పిపిపి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఏకంగా 10కొత్త వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమం చేపట్టమని అందుకు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. ఇందుకు



నిరసనకు హాజరైన వైసిపి శ్రేణులు

కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలే నిదర్శనమన్నారు. ప్రజల మద్దతుతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ పరిశీలకులు కర్రా హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, లాయర్ ప్రభాకర్, కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమ్ సింహారెడ్డి, గూడూరు మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న, జడ్‌పిటిసిలు రఘునాథ్ రెడ్డి, మౌలాలి, ప్రసన్న కుమార్, ఎంపిపిలు సునీతమ్మ, రూతమ్మ, జిల్లా అధికార ప్రతినిధి పోలకల్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పాటిల్ హనుమంత రెడ్డి, శివారాముడు, డి వాసు, రేమట సంపత్ కుమార్, మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, సోమశేఖర్ రెడ్డి, మోహన్ బాబు, రామాంజనేయులు, అబెల్, సోమశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించిన మంత్రి బి.సి



అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి బి.సి

బనగానపల్లెమేజర్,న్యూస్:ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి బి.సి జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారంనాడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి పలు విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితుల సమస్యలను అధికారులను దృష్టికి తీసుకెళ్లి త్వరిత గతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయబద్దంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాల వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## చౌడేశ్వరీ అమ్మవారి హుండీ ఆదాయం రూ.52లక్షలు

బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్: నందవరం శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి దేవస్థానం నందు బుధవారంనాడు అమ్మవారికి భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీలను లెక్కించారు. నగదు రూ.52లక్షల10వేల466 రూపాయలు రాగా బంగారు 44గ్రాముల500మి+ల్లీ గ్రాములు, వెండి వస్తువులు 1కేజీ710గ్రాములు భక్తులు అమ్మవారికి సమర్పించినట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్, కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ హుండీ లెక్కింపుకు తనిఖీ అధికారిగా చంద్రా రెడ్డి, రామసేతు నాగార్జున రెడ్డి వ్యవహరించగా ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, నందవరం గ్రామీణ బ్యాంకు క్యాషియర్లు రామలింగేశ్వరుడు, హుసేన్‌బాబు, నంద్యాల బాలాజీ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

## ప్రజా ఉద్యమర్యాలీకి భారీగా కదిలిన వైసీపీ శ్రేణులు



ర్యాలీలో పాల్గొన్నా సి.బెలగల్ మండల వైసిపి శ్రేణులు

సి.బెలగల్ మేజర్ న్యూస్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ ఆపాలని రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించింది. అందులో భాగంగా బుధవారం కోడుమూరు నియోజకవర్గంలో నిర్వహించే ప్రజా ఉద్యమ ర్యాలీలో పాల్గొనుటకు బెలగల్ నుండి వైసీపీ శ్రేణులు మండల కన్వీనర్ సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల వైసిపి సర్పంచులు, ఎంపీటీసీలు,కార్యకర్తలు,అభిమానులు, భారీగా కదిలారు.

**భారీగా సంతకాల సేకరణ:** కంబదహాల్ ఎస్సీ కాలనీలో వైసీపీ శ్రేణులు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యకర్తలు మహిళలు పురుషులు అందరూ కదిలి సంతకాలను సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

# గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు

ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కర్నూలు విమానాశ్రయంలో జిల్లా అధికారులు కలెక్టర్ డా.ఏ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా రాయలసీమ యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవం, మాంటిస్సోరి పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొని తిరిగి విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుండి ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్లారు.



గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

# ప్రజలను దగాచేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే - మాజీ ఎమ్మెల్యే శిల్పా

- వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే సహించేదిలేదు
- వైద్యంతో వ్యాపారం చేయాలనుకోవడం సిగ్గుచేటు
- రైతులను, ప్రజలను ఆదుకోవడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం
- వైసిపి ప్రజా ఉద్యమంతో భారీ ర్యాలీ నిర్వహించిన శిల్పా
- వైసిపి ప్రజా ఉద్యమానికి భారీ తరలివచ్చిన వైసిపి శ్రేణులు

ఆత్మకూరు, మేజర్‌న్యూస్: సూపర్ సిక్స్ పథకాలతో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని కల్లిబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను, రైతులను దగా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వైఎస్సార్‌సిపి శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తు తలపెట్టిన ప్రజా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గ కేంద్రం ఆత్మకూరులో శిల్పా నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. పట్టణంలోని నంద్యాల టర్నింగ్ నుంచి పోలీసు రఘునాథ్ సెంటర్ , పోలీసు స్టేషన్, గౌడ సెంటర్, పాతబస్టాండ్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం చేరుకొని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యంతో వైద్య చదువును కూడా అందుబాటులోకి తెచ్చేందుకు 17 వైద్య కళాశాలను జగన్ మోహన్ రెడ్డి తెస్తే కూటమి ప్రభుత్వవాటిని ప్రైవేటీ కరణ చేసి సొమ్ము చేసుకోవాలనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. వైద్య విద్యను ప్రైవేటీ కరణ చేయడం ద్వారా పేదలక విద్యతో పాటు వైద్యం దూరమవుతుందని, పేదల సంక్షేమాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకొనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ విషయం తెలియదా





ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

అని ఎద్దేవా చేశారు. విజన్ ఉన్న నాయకుడినని చెప్పుకొనే చంద్రబాబు వైద్య విద్యను తన బినామిలక అప్పగించి వైద్య విద్యను వ్యాపారంగా మార్చుకోడమేనా విజన్ అంటే అని విమర్శించారు. రైతులు అకాల వర్షాలతో అష్టకష్టాలు పడుతూ నిస్సాహాయ స్థితిలో ఉంటే రైతులకు ఏమి చేశారని ప్రశ్నించారు. సరైనంత యూరియ అందించడం చేతకాక యూరియా వాడకం మంచిదికాదని రైతులకు చెప్పడం ఏమిటని విమర్శించారు. వరదలతో లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ అన్నమో రామచంద్ర అంటుంటే కనీసం పలకరించే నాథుడు లేడని, అందరిని ఆదుకున్నామంటూ ఒకరికొకరు ప్రసంశపత్రాలు అందించుకోవడం సిగ్గుచేటని అన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటీ కరణ చేయడం, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి ఇష్టానుసారంగా పాలన సాగిస్తే చూస్తు ఊరుకోమని ప్రజల తరుపున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సూపర్‌సిక్స్ పథకాలను సక్రమంగా అమలు చేయకుండా విజయోత్సవ ర్యాలీలు జరుపుకోవడం కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజా వ్యతిరేక వి ధానాలను మానుకోని ప్రజా సంక్షేమానికి కట్టుబడి పాలన సాగించాలని లేదంటే ప్రజలతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఆత్మకూరులో నిర్వహించిన వైఎస్సార్‌సిపి ప్రజా ఉద్యమంలో నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర రెడ్డి, వైసిపి నాయకులు , కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

AP - TET

# APTET నోటిఫికేషన్-2025

**త్వరలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో డీఎస్సీకి అర్హత ఐన టెట్ పరీక్ష నోటిఫికేషన్ వెలువడింది. 2011కు ముందు ప్రభుత్వ పాఠశాలల్లో నియమితులైన ఉపాధ్యాయులందరూ టెట్ పరీక్ష రాయాల్సి రావటం, నూతనంగా డీఎస్సీకి అర్హత సాధించిన అభ్యర్థులు, గతంలో టెట్‌లో అర్హత సాధించలేక పోయిన అభ్యర్థులతో పాటు తమ స్కోరు మెరుగు పరచు కోవాలనుకునే వారికి ప్రస్తుత టెట్ నోటిఫికేషన్ ఓ సువర్ణావకాశం, ఈ నేపథ్యంలో టెట్ 2025పరీక్ష విధానం.. సిలబస్, అర్హత మార్కులు, తదితర వివరాలు తెలుసుకుందాం..**

ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ 2025) విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 24 నుంచి ప్రారంభమైంది. అర్హత కలిగిన అభ్యర్థులు నవంబర్ 23, 2025వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సుప్రీంకోర్టు తీర్పుతో 2011కు ముందు ప్రభుత్వ పాఠశాలల్లో నియమితులైన ఉపాధ్యాయు లందరూ టెట్ పరీక్ష రాయాల్సి ఉండటంతో నిరుద్యోగ అభ్యర్థులతో పాటు ఇన్ సర్వీస్ టీచర్లకు సైతం టెట్ రాసేందుకు అవకాశం కల్పించారు. టెట్ పరీక్ష డిసెంబర్ 10న రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. టెట్ ఫలితాలు వచ్చే ఏడాది జనవరి 19న వెలువడనున్నాయి.

ఈసారి టెట్ దరఖాస్తు ఫీజును పెంచారు. ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించాలని పేర్కొంది. అంటే ఒక అభ్యర్థి 2 పేపర్లకు పరీక్ష రాస్తే రూ. 2 వేలు పరీక్ష ఫీజుగా చెల్లించాలి. పేపర్ 1 ఏ, పేపర్ 1 బి, పేపర్ 2 ఏ, పేపర్ 2 బి మొత్తం 4 పేపర్లకు టెట్ పరీక్ష ఉంటుంది. ఎన్ని పేపర్లు రాస్తే అన్నింటికీ వేర్వేరుగా ఫీజు కట్టాలి. నోటిఫికేషన్, సమాచార బులెటిన్, పరీక్షల షెడ్యూలు, సిలబస్, అభ్యర్థులకు సూచనలు, అర్హతలు వంటి వివరాలను https://aptet. apcfss.in, http://cse. ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

**ముఖ్య వివరాలు**

- టెట్‌ను పేపర్-1ఎ, 1బి, పేపర్-2ఎ, 2బిల పేరుతో మొత్తం నాలుగు పేపర్లుగా నిర్వహించనున్నారు.
- పేపర్-1ఎ ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ఉపాధ్యాయులుగా బోధించాలనుకునే వారు రాయాల్సిన పరీక్ష.
- పేపర్-1బి అనేది ఒకటి నుంచి 5వ తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పనిచేయాలనుకునే వారు రాయాల్సి ఉంటుంది. స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్స్‌లో టీచర్లకు ఈ పేపర్ ఉత్తీర్ణత తప్పనిసరి అనే ఎన్‌సీటీఈ నిబంధనలకు అనుగుణంగా దీన్ని ప్రవేశ పెట్టారు.

### ఇలా దరఖాస్తు చేసుకోండి....

- అర్హత గల అభ్యర్థులు మొదటగా అధికారిక వెబ్‌సైట్ https://aptet.apcfss.in లోకి వెళ్లాలి.
- Payment అనే ఆప్షన్ పై క్లిక్ చేసి మొదటగా చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయాలి.
- పేమెంట్ ప్రక్రియ పూర్తి అయితే లాగిన్ ఐడీ క్రియేట్ అవుతుంది.
- ఈ లాగిన్ వివరాలతో మీ దరఖాస్తు ఫారమ్‌ను పూర్తి చేయవచ్చు.
- ఫొటో, సంతకంతో పాటు కావాల్సిన పత్రాలను అప్ లోడ్ చేయాలి.
- సబ్మిట్ బటన్ పై నొక్కి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయవచ్చు.
- ప్రింట్ లేదా డౌన్లోడ్ అనే ఆప్షన్ పై నొక్కి అప్లికేషన్ ఫారమ్‌ను పొందవచ్చు. హాల్ టికెట్ల సమయంలో అప్లికేషన్ నెంబర్ అవసరపడుతుంది.

- పేపర్-2ఎ ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్‌గా బోధించాలనుకునే వారు ఉత్తీర్ణత సాధించాల్సిన పేపర్.
- పేపర్-2బి ఆరు నుంచి 8వ తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌గా బోధించాలనుకునే వారు అర్హత సాధించాల్సి ఉంటుంది.
- లాంగ్వేజ్ టీచర్ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకున్న వారు సదరు లాంగ్వేజ్ ఆప్షనల్ సబ్జెక్టుగా బ్యాచిలర్ డిగ్రీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్ ఉత్తీర్ణులవ్వాలి. లేదా సంబంధిత లాంగ్వేజ్‌లో పీజీ ఉత్తీర్ణతతో పాటు లాంగ్వేజ్ పండిట్ ట్రైనింగ్ సర్టిఫికేట్ కోర్సు లేదా సదరు లాంగ్వేజ్ మెథడాలజీతో బీఈడీలో ఉత్తీర్ణత తప్పనిసరి.

**పరీక్ష విధానం:**

- ఏపీ టెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. రోజుకు రెండు సెషన్లలో ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి



12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా కేంద్రాలను ఎంపిక చేశారు. రాష్ట్రం బయట ఉన్నవారి కోసం సెంటర్లను హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేయనున్నారు.

పరీక్ష ఫీజు: రూ.1000.

దరఖాస్తువిధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**సిలబస్, పరీక్షా విధానం**

- టెట్ పేపర్1ఎ, 1బి, పేపర్2ఎ, 2బిలను 150 మార్కులకు నిర్వహిస్తారు.
- అన్ని పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి పేపర్‌కు 2:30 గంటల సమయం అందుబాటులో ఉంటుంది.
- ఏపీ టెట్‌లోని అన్ని పేపర్లలోనూ అభ్యర్థులు తప్పనిసరిగా కనీస ఉత్తీర్ణత మార్కులు పొందాలి. ఒక్కసారి అర్హత సాధిస్తే జీవిత కాలంపాటు సంబంధిత సర్టిఫికెట్ తో డీఎస్సీ రాయవచ్చు.
- టెట్ లో మార్కులకు డీఎస్సీలో వెయిటేజ్ ఉంది. 20 శాతం మార్కులు డీఎస్సీలో యాడ్ అవుతాయి. టెట్ ,డీఎస్సీ రెండింట్లో వచ్చిన మార్కుల ఆధారంగా తుది జాబితాను రూపొందించి ఫలితాలను విడుదల చేస్తారు.

**విభాగాలు మార్కుల వివరాలు....**

**పేపర్-1ఎ, -1బి :**

- పేపర్-1ఎ, పేపర్-1బిలను అయిదు విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు.

**చైల్డ్ డెవలప్‌మెంట్ & పెడగాజీ:** లాంగ్వేజ్-1, లాంగ్వేజ్-2, మ్యాథమేటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో విభాగం నుండి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. లాంగ్వేజ్-1 సబ్జెక్ట్ కింద తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠీ, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు.

**పేపర్-2ఎ :**

ఈ పేపర్‌లో నాలుగు విభాగాలు ఉంటాయి. చైల్డ్ డెవలప్‌మెంట్ & పెడగాజీ 30 ప్రశ్నలు -30 మార్కులు, లాంగ్వేజ్-1 : 30 ప్రశ్నలు -30 మార్కులు, లాంగ్వేజ్-2, ఇంగ్లీష్ : 30 ప్రశ్నలు - 30 మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ : 60 ప్రశ్నలు-60 మార్కులకు పరీక్ష ఉంటుంది. మొత్తం 150 ప్రశ్నలు - 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. నాలుగో విభాగంగా నిర్వహించే సంబంధిత సబ్జెక్ట్ విషయంలో... మ్యాథమాటిక్స్ & సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్ & సైన్స్ విభాగాన్ని, సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని, లాంగ్వేజ్ టీచర్లు సంబంధిత లాంగ్వేజ్‌ను ఎంచుకొని పరీక్ష రాయాలి.

**పేపర్-2బి :**

పేపర్-2బిని కూడా పేపర్-2ఎ మాదిరిగా నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. మొదటి మూడు విభాగాలు పేపర్-2ఎ లోనివే ఉంటాయి. నాలుగో విభాగంగా డిజేబిలిటీ స్పెషలైజేషన్ సబ్జెక్ట్ & పెడగాజీ ఉంటుంది. ఈ విభాగంలో 60 మార్కులకు - 60 ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం నాలుగు విభాగాలు కలిపి 150 ప్రశ్నలతో 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. నాలుగో విభాగంలో అభ్యర్థులు తాము స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చదివిన సబ్జెక్ట్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. అన్నిపేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి పేపర్‌కు 2.30 గం.ల సమయం ఉంటుంది.

**అర్హతలు ....**

- టెట్ పేపర్1-ఎకు 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణతలో పాటు డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
- పేపర్ 1-బికు 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణతలో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిప్లమా ఉత్తీర్ణులై ఉండాలి.
- పేపర్ 2-ఎ కు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతలో పాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పేపర్2-బికు 50శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతలో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలకు http://cse.ap.gov.inవెబ్‌సైట్ చూడండి.

**టెట్‌లో అర్హత సాధించాలంటే....**

టెట్‌లో అర్హతకు ఓసీ అభ్యర్థులు 60శాతం (90 మార్కులు) బీసీ అభ్యర్థులు 50శాతం (75 మార్కులు), ఎస్సీ,ఎస్టీ,పీహెచ్ అభ్యర్థులు 40శాతం (60 మార్కులు) సాధించాలి.

- డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.
- టెట్, డీఎస్సీ పరీక్షలను కంప్యూటర్ ఆధారంగా నిర్వహించనున్నారు.
- ఇతర వివరాలు, సందేహాలకు ఈ కింది హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించండి.

8121947387, 8125046997, 7995649286, 7995789286, 9963069286, 6281704160

**మంచి మార్కులకు సూచనలు:**

- చైల్డ్ డెవలప్‌మెంట్ & పెడగాజీలో ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం, నాయకత్వం, గైడెన్స్, కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి.
- లాంగ్వేజ్-1లో స్కూలుస్థాయిలో తెలుగుసబ్జెక్ట్ పుస్తకాలతో పాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి.
- ఇంగ్లీష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ & ఇన్‌డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపారిజన్, వొకాబులరీ.. మొదలైన అంశాలపై అవగాహన తో చదవాలి.
- మ్యాథమేటిక్స్& ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ కు పేపర్-1 లో ప్రాథమిక అంశాలపై ఒకటి నుండి అయిదో తరగతి స్థాయి వరకు, పేపర్-2లో మ్యాథ్స్, సైన్స్ ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్‌తోపాటు సమకాలీన అంశాలపైనా ప్రశ్నలు ఉంటాయి.
- సైన్స్‌కు పేపర్-2 కోసం ఆరు నుండి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలుచదవాలి.
- సోషల్ స్టడీస్ ఆరు నుండి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను చదవాలి. సివిక్స్‌కు సంబంధించి తాజా అంశాలు చదవాలి.
- మెథడాలజీ విభాగంలో ప్రధానంగా బోధనా పద్ధతులు, టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎమ్), బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి. పేపర్-1,పేపర్-2లో సిలబస్ అంశాలు ఒక్కటే అయినా, వాటి క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. దీన్ని గుర్తించి ప్రిపరేషన్ చేయాలి.
- గత ప్రశ్నాపత్రాలను సాధించటం ద్వారా ఏఏ అంశాలలో ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో తెలుస్తుంది. దీనికనుగుణంగా ప్రిపరేషన్ మలుచు కోవాలి.
- ప్రణాళికా బద్ధంగా కృషిచేస్తే విజయం మీదే..!

### ఏపీ టెట్ 2025 ముఖ్య తేదీలు:

| | |
|---|---|
| ఏపీ టెట్ నోటిఫికేషన్ | 24-10-2025. |
| దరఖాస్తులు ప్రారంభం | 24-10-2025 |
| దరఖాస్తులకు తుది గడువు | 23-11-2025 |
| టెట్ మాక్ టెస్ట్ విడుదల తేదీ | 25-11-2025 |
| హాల్ టికెట్లు డౌన్‌లోడ్ తేదీ | 03-12-2025 |
| టెట్ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ | 10-12-2025 నుంచి రెండు సెషన్లలో |

- టెట్ ప్రాథమిక కీ 2-1-2026 న విడుదల చేస్తారు. ఈ కీపై అభ్యంతరాలను 9-1-2026 వరకు స్వీకరిస్తారు.
- టెట్ తుది కీని 13-1-2026 న రిలీజ్ చేస్తారు.
- 19-1-2026న టెట్ తుది ఫలితాలు విడుదల చేస్తారు.

# ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించిన టిడిపి

**-రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్**



**కర్నూలు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలో మౌర్య ఇన్‌లో జరిగిన శ్రీ వాసవి మహిళా మండలి 35వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ సతీమణి, శ్రీ వాసవి మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు టీజీ రాజ్యలక్ష్మి, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఆయన సతీమణి టీజీ శిల్పా భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా శ్రీ వాసవి మహిళా మండలి చక్కటి కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ సంస్థ ప్రణాళికబద్ధంగాకార్యక్రమాలను రూపొందిస్తుందని వివరించారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మహిళలను మరింత చైతన్యవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఇలాంటి సంస్థల్లో ఉండటం వల్ల విషయ పరిజ్ఞానం పెరగడంతో పాటు నెట్వర్క్ పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నుంచి కర్నూలు పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పారు. తాను పరిశ్రమల మంత్రిగా ఉండటం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇమేజ్ నేపథ్యంలో కర్నూలు పరిసర ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయలతో పరిశ్రమల ఏర్పాటు జరుగుతుందని వివరించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం నాడు ఓర్వకల్లు మండల పరిధిలో రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ లాంటి ఎన్నో ప్రాజెక్టకు శంకుస్థాపన చేయడం జరిగిందని వివరించారు. ఇటీవల 23 వేల కోట్ల రూపాయలకు సంబంధించిన ప్రాజెక్టుకు క్యాబినెట్ క్లియరెన్స్ ఇచ్చిందని తెలిపారు. కర్నూల్ ప్రాంతంలో రిలయన్స్ లాంటి ప్రఖ్యాతిగాంచిన సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైంది అని తెలిపారు. దీంతోపాటు హైకోర్టు బెంచ్ ఏర్పాటును ఏ బి సి క్యాంపు స్థలాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు స్థానికంగానే లభిస్తాయని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం దీర్ఘకాలంగా అధికారంలో ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన తెలిపారు .తాను పరిశ్రమల మంత్రిగా దేశంతో పాటు విదేశాల్లో పర్యటిస్తున్నానని, ఈ నేపథ్యంలో స్థానికంగా ఉండడం లేదన్న భావనను ప్రజలు భావించవద్దని ...కర్నూలు అభివృద్ధి చెందుతుందా... లేదా అన్నది అంతిమంగా ఆలోచించాలని ఆయన సూచించారు. ఈనెల 16వ తేదీ జరిగే ఆర్యవైశ్యుల కార్తీక వనభోజన కార్యక్రమంలో ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను, బలాన్ని చాటాలని ఆయన తెలిపారు. గత ఎన్నికల్లో దాదాపు 95 శాతం మంది ఆర్యవైశ్యులు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేశారని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్యవైశ్యులకు సముచిత ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న మంత్రివర్గంలో ఒక్క ఆర్యవైశ్యుడు కూడా లేడని ,కానీ రాష్ట్ర మంత్రివర్గంలో తనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవకాశం కల్పించిన విషయాన్ని ప్రస్తావించారు. అనంతరం లక్కీ డిప్ తీసి విజేతలకు బహుమతులను ముఖ్య అతిథులు అందజేశారు.

## ఇసుక రవాణా, తవ్వకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, విక్రయాల్లో పూర్తి పారదర్శకతతో చర్యలు చేపట్టి ప్రజలకు ఇసుక సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజకుమారిఅధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లా మైనింగ్ అధికారి వేణుగోపాల్, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్, ఆర్డీవో విశ్వనాథ్, గ్రౌండ్ వాటర్ అధికారి రఘురాం, ఆర్‌టిఓ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా పర్యావరణానికి ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనల ప్రకారం మాత్రమే జరగాలన్నారు. తవ్వకాలు, రవాణా, నిల్వ మరియు విక్రయం మొత్తం ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆళ్ళగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, నందికొట్కూరు, నంద్యాల మండలాల్లో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లు రెన్యువల్ అంశాలను సమీక్షిస్తూ అందులో ఆళ్ళగడ్డ, నంద్యాల స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు లేకపోవడం, పలు ఫిర్యాదులు రావడం, రికార్డుల నిర్వహణలో లోపాలు ఉన్న కారణంగా వాటి రెన్యువల్‌కు అవకాశం లేదని కలెక్టర్ తెలిపారు. నంద్యాల స్టాక్ యార్డ్ డిపో హోల్డర్‌ను పిలిపించి విచారణ జరపాలని మైనింగ్ ఎడిని ఆదేశించారు. ప్రజలకు ఇసుక సకాలంలో అందుబాటులో ఉండేలా సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. డోన్ పట్టణంలో కొత్త ఇసుక స్టాక్ యార్డు ఏర్పాటుకు టెండర్లను పిలవాలన్నారు. జిల్లాను రాష్ట్రస్థాయిలో దిగువ స్థానంలో ఉంచకుండా క్రమబద్ధంగా పనులు చేపట్టాలన్నారు.

## విమానాశ్రయంలో గవర్నర్‌కు ఆత్మీయ స్వాగతం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా కర్నూలు విమానాశ్రయంకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ డా.ఏ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఓర్వకల్లు తహశీల్దార్ విద్యాసాగర్ తదితరులు ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం పలికారు. జిల్లా పర్యటనలో భాగంగా విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుండి ప్రత్యేక విమానంలో బయలుదేరి కర్నూలు ఎయిర్ పోర్టుకి ఉదయం 11గంటలకు చేరుకున్నారు. అనంతరం గవర్నర్ కర్నూలు ఎయిర్‌పోర్టు నుండి రాయలసీమ యూనివర్సిటీకి బయలుదేరారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి టీజీ భరత్,, కలెక్టర్ డా.ఏ సిరి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపి నాగరాజు, ఎమ్మెల్యేలు, ఎస్పీ

# శివమాలాధారణ అత్యంత శుభప్రదం

**– అత్యంత విశేషమైన ఫలప్రదం కార్తీకమాసం**
**– శివస్వాములకు భిక్ష అందించడం వల్ల సకల ప్రయోజనాలు**

**అవుకుమేజర్,న్యూస్ః** అనాదిగా కార్తీకమాసంలో శివమాలాధారణ చేయడం అనేది సహజసిద్ధమైన పరిణామంగా ఉండేది గతంలో కొంత కాలం మరుగునపడ్డ ప్రస్తుతం ఇది పూర్తిస్థాయిలో ప్రాచుర్యం పొంది గ్రామగ్రామాన శివమాలాధారణ చేసి శివదీక్షను మండలంరోజున కొనసాగించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ శివమాలదీక్ష వల్ల దీక్షదారునికి కోరుకున్న ఫలము లభించడమేగాక సర్వ పాపాల నుండి విముక్తి కలుగుతుందని దీక్షాదారులు విశ్వశిస్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రమైన అవుకులో దాదాపుగా 50 నుంచి 60మంది వ్యక్తులు శివదీక్షను చేపట్టి స్థానిక శ్రీ కాశీవిశ్వనాథ విశ్వేశ్వర దేవాలయంలో వేకువజాము నుండే స్నానం ఆచరించి శివునికి పూజలు చేస్తూ ఏకభుక్తంగా ఉంటూ మిగిలిన సమయంలో శివనామపారాయణం చేస్తూ కాలాన్ని గడుపుతున్నారు. శివుడు అనగా శంకరుడు, శుభంకరుడు, సర్వ శుభములను ఇచ్చువాడు అందులో పరమశివునికి అత్యంత ప్రీతికరమైనది కార్తీకమాసం ఈ నెలలోనే ఈ దీక్షాధారణ చేయడం వల్ల అనంతమైన శుభపాలప్రదమని భక్తులు విశ్వసిస్తారు. ఇందుకు సంబంధించిన దీక్షాదారులకు భక్తులు భిక్షను అందజేయడం ఒక ఆనవాయితీగా వస్తుంది. ఇందుకు సంబంధించి కొంతమంది భక్తులు కొంత సమయంలో దీక్షాదారులకు ఆహారాన్ని అందించం ఎంతో మంచిదిగా భావించి ఆహారాన్ని అందిస్తారు. ఇటీవలే శివదీక్షాదారులకు కాశీవిశ్వనాథస్వామి గుడిలో ఒక బిడ్డను అందించడం జరిగింది. శివదీక్షదారుల ఆశీర్వాదం బిడ్డను అందించిన వారికి ఎల్లవేలలా ఉంటుందని దీక్షాదారులు తెల్పుతున్నారు. మంగళవారం రాత్రి కాశీవిశ్వనాథస్వామి దేవాలయంలో జైపాల్ రెడ్డి అనే భక్తుడు శివదీక్షాదారులకై బిడ్డను అందించారు. ఇదే విధంగానే పలువురు భక్తులు దీక్షాదారులకు బిడ్డను అందించాలని కోరుతున్నారు.

# ప్రైవేటీకరణతో పేద విద్యార్థులు రిజర్వేషన్ కోల్పోతారు..

**– మాజీ ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి**
**– డోన్‌లో భారీ ఎత్తున ప్రజా ఉద్యమం**
**– కలిసివచ్చిన కామ్రేడ్స్**
**– డోన్‌లో దోపిడిపై ఉమ్మడిగా పోరాడతాం..**




ర్యాలీగా వస్తున్న మాజీ మంత్రి బుగ్గన, వైయస్‌ఆర్‌సిపి శ్రేణులు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వలన రాష్ట్రంలోని బుడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు రిజర్వేషన్లు కోల్పోతారని రాష్ట్ర మాజీ ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్‌ఆర్‌సిపి చేపట్టిన ప్రజా ఉద్యమం ర్యాలీ బుధవారం డోన్‌లో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున చేపట్టారు. వైయస్‌ఆర్‌సిపి శ్రేణులు, సిపిఐ, సిపిఎం ప్రజా సంఘాలు స్థానిక మధు ఫంక్షన్ హాల్ నుండి బయలుదేరి పాతబస్టాండ్ వరకు భారీ ర్యాలీ చేశారు. అనంతరం పాతబస్టాండ్‌లోని సమైక్యాంధ్ర కట్ట వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ ఆస్తులను తన అనుయాయులకు కట్టపెట్టేందుకే ప్రైవేటీకరణ జపం చేస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా క కేవలం మూడేళ్ళ కాలంలోనే 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మాజీ సిఎం జగన్ ఏర్పాటు చేస్తే ప్రస్తుత సిఎం చంద్రబాబు వాటిని ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ఘనత వైయస్.రాజశేఖరరెడ్డి కుటుంబానికి దక్కుతుందన్నారు. కాని నేడు రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద పేదలకు వైద్యం అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. సిఎం చంద్రబాబు మాయ మాటలతో పేద ప్రజలను నమ్మించి గద్దెనెక్కి నమ్మినవారిని నట్టేట ముంచారన్నారు. అదేవిధంగా డోన్‌లో పేదల కోసం వంద పడకల ఆసుపత్రి తాము నిర్మిస్తే ప్రస్తుతం ఉన్న పాలకులకు వాటి నిర్వహణ కూడా చేతకాక గాలికి వదిలేశారని ఎద్దేవచేశారు. డోన్, ప్యాపిలిలో పట్టణ పార్కుల సుందరీకరణ కోసం తాము రెండు కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తే ఏడాదిన్నర కూటమి పాలనలో మూడు పిల్లర్లకు రంగులు వేయడం తప్ప చేసింది ఏమిలేదన్నారు. సిపిఐ నాయకులు రంగనాయుడు, సుంకయ్యలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై వైయస్‌ఆర్‌సిపితో కలిసి పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో డోన్‌లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు తాము కూడా మద్దతుగా నిలిచామని, అదేవిధంగా ప్రస్తుత కూటమి నాయకులు చేస్తున్న దోపిడిపై కూడా రాబోయే రోజుల్లో వైయస్‌ఆర్‌సిపితో కలిసి ఉద్యమాలకు సిద్ధమౌతామని స్పష్టం చేశారు. అనంతరం మాజీ ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌డిఓ కార్యాలయంలో ఏఓ అంజన్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీట్‌కార్పోరేషన్ మాజీ చైర్మన్ ఎం.శ్రీరాములు, డోన్, ప్యాపిలి ఎంపిపిలు రేగటి రాజశేఖర్‌రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి, డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మెట్టుపల్లె వెంకటేశ్వరరెడ్డి, డోన్ పట్టణ మండల వైకాపా అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, సోమేష్‌యాదవ్, బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి, ప్యాపిలి ఉపసర్పంచ్ గడ్డం భువనేశ్వరరెడ్డి, కమతం భాస్కర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది నాగభూషణంరెడ్డి, నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్, కౌన్సిలర్ టిఈ.దినేష్‌గౌడ్, నియోజకవర్గ వైకాపా యువత అధ్యక్షులు ఆర్‌ఈ.రాజవర్ధన్, చంద్ర, ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర, క్వాలిటీ అబ్దుల్లా, గడ్డం సురేష్, నియోజకవర్గంలోని ఆయా మండలాల వైయస్‌ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, సిపిఐ, సిపిఎం నాయకులు, మోటా రాముడు, నారాయణ, సిపిఎం నాయకులు నక్కి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.